క్లుప్తంగా

ఘనంగా వీరభద్రేశ్వర స్వామి సంబరం

వీరవాసరం: మండలంలోని రాయకుదురులో వీరభద్రేశ్వరస్వామి సంబరం మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మేళ, తాళాలతో బాణాసంచా కాల్పులు మధ్య స్వామి వారి ప్రభను ఊరేగింపు నిర్వహించారు. దవడలకు, మెడలకు చేతులకు శులాలు దింపుకొని ప్రదర్శనలు చేశారు. ఇనుప చువ్వలతో, హుక్కులతో సినిమాల్లో మాదిరిగా గాల్లో వేలాడుతూ చేసిన ప్రదర్శన చూపర్లను కట్టిపడేసింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు.

సాధనతోనే జ్ఞాపక శక్తి వృద్ధి

ఆకివీడు: సాధనతోనే విద్యార్థులు జ్ఞాపక శక్తిని వృద్ధి చేసుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, పాన్ ఇండియా మెమరీ గురువు జయ సింహ పిలుపునిచ్చారు. విద్యార్థులకు జ్ఞాప శక్తిపై స్థానిక షాదీఖానా హాలులో ప్రత్యేక కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా జయ సింహ మాట్లాడుతూ ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రణాళికతో ముందడుగు వేయాలని, వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడమే కాకుండా దేశానికి కూడా ఉపయోగపడే వ్యక్తిత్వం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ధ్యాన రత్న ఉండ్రమట్ల సాంబశివరావు, ప్రిన్సిపాల్ కనకదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

వీరవాసరం: మండలంలోని అండలూరు, తోలేరు గ్రామాల్లో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక భీమవరం కమిటీ వారి ఆధ్వర్యంలో మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. త్రిమత ఏకైక గురువు , తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ప్రబోధాశ్రమం స్థాపకుడు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి రచించిన 100 ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం కమిటీ అధ్యక్షుడు సభ్యులు ఉదయ్‌కుమార్, వాసుదేవ నాగేశ్వరరావురాజు, లోకేష్ మూర్తి, ప్రభాకర్, సత్యనారాయణ, లావణ్య, సుజాత, లక్ష్మీ భవాని, యశోద, తారకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై నిఘా

ఆకివీడు: అసాంఘిక కార్యక్రమాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు చెప్పారు. స్థానిక ప్రధాన సెంటర్‌లోని కార్తికేయ జూనియర్ కాలేజీ వద్ద డ్రోన్ పర్యవేక్షణను సీఐ, ఎస్ఐలు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కాలేజీల వద్ద హైస్కూళ్ల వద్ద ఆకతాయిల బెడదను తొలగించేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా గంజాయి, ఇతర మత్తుపదార్థాల తరలింపుపై కూడా నిఘా పెట్టామన్నారు. రహదారులపై మోటారు సైకిళ్ల విన్యాసాలు, నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వ్యక్తులపైన, అతివేగంగా మోటారుసైకిళ్లను నడుపుతున్న యువతపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఇలాంటి సంఘటనలపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై హనుమంతు నాగరాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

చేతివృత్తుల వారికి లయన్స్ క్లబ్ చేయూత

ఉండి: సమాజంలో చేతివృత్తులు చేసుకుని జీవించేవారిని ఆదుకోవడానికి ఉండి లయన్స్‌క్లబ్ చిరు ప్రయత్నంగా వారికి కావాల్సిన పనిముట్లు అందించినట్లు క్లబ్ ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు, కార్యదర్శి ముదునూరి శివరామరాజు అన్నారు. ఉండిలో కార్యదర్శి శివరామరాజు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ రీజియన్ చైర్మన్ గొంట్ల కృష్ణమూర్తి 50 శాతం ఖర్చు భరించి ఇచ్చిన గ్రైండర్, వీల్ చైర్, ట్రై సైకిల్‌ను లబ్ధిదారులకు అందజేసినట్లు ప్రతినిధులు తెలిపారు. రీజియన్ స్థాయిలో బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు క్లబ్ మండలాధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి, ఫస్ట్ బెస్ట్ ట్రెజరర్‌గా పాలతీర్థపు నర్సింగరావు, అప్రిషియేషన్ అవార్డు అడ్మినిస్ట్రేటర్ నరసరాజుకు దక్కిందని వారు తెలిపారు. కార్యక్రమంలో డీసీ కన్నెగంటి రూత్‌కళ తదితరులు పాల్గొన్నారు.

14న రాజగోపురాల శిఖర ప్రతిష్ఠ

కాళ్ల: మండలంఒలని దొడ్డనపూడి ఉన్న శ్రీ పార్వతీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి, శ్రీ భూ సమేత చెన్నకేశవస్వామి వార్ల ఆలయాల్లో నూతనంగా నిర్మించిన రాజగోపురాల శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం ఈనెల 14న, శుక్రవారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయాలనిర్మాణ కమిటీ సభ్యులు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామస్తులు, దాతలు సహకారంతో అత్యంత సుందరీకరణంగా నిర్మించిన రెండు రాజగోపురాలకు శిఖర ప్రతిష్ఠ, ఆలయాల వార్షికోత్సవం కార్యక్రమాల్లో భాగంగా బుధవారం నుంచి ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

గుర్తుకొస్తున్న వలంటీర్ల సేవలు

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్ల అద్భుత సేవలు
- నేడు సచివాలయ సిబ్బందిపై భారం





పాండువ్వలో సర్వే నిర్వహిస్తున్న వలంటీర్స్(ఫైల్‌ఫోటో)

ఉండి: ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అన్ని శాఖల అధికారులు అడుగడుగునా వలంటీర్ల సేవలను గుర్తు చేసుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామ, వార్డు వలంటీర్లను ఏర్పాటు చేసి ప్రతి సంక్షేమ పథకాన్నీ అవినీతి రహితంగా లబ్ధిదారునికి చేర్చిన ఘనత అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది. అడుగడుగునా వలంటీర్ల సేవలతో ప్రతి సచివాలయంలోనూ పరిపాలన, సంక్షేమ పథకాల అమలు చాలా సులభంగా అయ్యేది. అయితే వలంటీర్ల వ్యవస్థపై మొదటి నుంచి విషం చిమ్మిన కూటమి పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో మాత్రం వారికి రూ.10 వేల జీతం ఇస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చాక వలంటీర్ వ్యవస్థనే లేకుండా చేశారు. పెరుగుతున్న పనిభారంతో సచివాలయ సిబ్బందితో పాటు ప్రభుత్వ అధికారులు వలంటీర్ల సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

సిబ్బంది తక్కువ సర్వేలు ఎక్కువ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ సర్వే అయినా, ఏ సంక్షేమ పథకానికి అర్హుల గుర్తింపు లేదా అమలు చేయాలన్నా అతి సులభంగా పనులు చకచకా జరిగిపోయేవని గుర్తు చేసుకుంటున్నారు. కానీ ఇప్పుడు పీ–4 సర్వేతో పాటు ఎంఎస్ఎంఈ సర్వే, పీఆర్ఐ యాప్, జీఎస్‌డబ్ల్యూ యాప్, క్లోరినేషన్ యాప్, వర్క్‌ఫ్రమ్ హోమ్ గుర్తింపునకు ఓ యాప్ వంటివి సర్వేలతో పాటు యాప్‌ల నిర్వహణ అధికంగా ఉండటంతో వివిధ శాఖల అధికారుల, సచివాలయ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో ప్రతి గ్రామ సచివాలయానికీ కనీసం 15 మంది వలంటీర్లు ఉండేవారని ఇప్పుడు సచివాలయంలో కనీసం 10 మంది అధికారులు కూడా లేరని వారు ఆందోళన చెందుతున్నారు. సిబ్బంది లేకుండా సర్వేలు, యాప్‌లు అంటే ఎలా? అంటూ వాపోతున్నారు. అంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు.

భయం భయంగా విధుల నిర్వహణ

కూటమి ప్రభుత్వంలో ఉద్యోగం చేయాలంటే భయం , కూటమి నాయకుల ఒత్తిడులతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో కొందర ఉద్యోగాన్ని వదులుకోవాలి లేదా వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకోవాలని ఆలోచిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సరిపడా సిబ్బంది లేకుండా సర్వేలు, యాప్‌లు అంటుంటే ఏం చేయాలో తెలియని సందిగ్ధంలో ఉంటున్నామని, కార్యాలయాలు విడిచిపెట్టి కొన్ని రోజుల పాటు గ్రామంలో తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ప్రజలకు వేగంగా సేవలను అందించే వలంటీర్ల వ్యవస్థను తిరిగి తీసుకుని రావాలని కోరుతున్నారు.

వలంటీర్లు, సచివాలయ వివరాలు

మండలం	సచివాలయాలు	ఉండాల్సిన ఉద్యోగులు	ఉన్నవారు	వలంటీర్లు
ఉండి	21	223	150	372
ఆకివీడు	12	133	100	362
కాళ్ల	21	231	161	314
పాలకోడేరు	18	188	119	352

వలంటీర్ సేవలు ఎంతో విలువైనవి



గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, ఇతర పారట్టీ వలంటీర్ల సేవలను తక్కువ చేసి చూపాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏం చేయాలన్నా వలంటీర్ల సేవలు గుర్తుకొస్తున్నాయి. మేమంతా చేసింది సేవే. కానీ ఏదో చెడ్డ పని చేస్తున్ననట్లు క్రియేట్ చేశబూరు. అంతే కాకుండా మోసగించి వలంటర్లను తొలగించారు. ప్రభుత్వ పథకాలు నిరాటంకంగా అమలు కావాలంటే మళ్ళీ వలంటీర్ల వ్యవస్థ రావాల్సిందే.

– గొంతే హరీష్, పాండువ్వ

వలంటీర్లను గుర్తు చేసుకుంటున్నారు



సచివాలయానికి సంబంధించి ఏ పని జరగాలన్నా.. ఏం చేయాలన్నా.. వలంటీర్లు అందుబాటులో ఉండి ప్రజలకు ఆ సేవలను అందించేవారు. కానీ ఇప్పుడు ప్రజలంతా సచివాలయానికి వెళ్లి పని చేయించుకోవాల్సిందే. అధికారులు వివిధ సర్వేలు అంటూ గ్రామాల్లోనే తిరుగుతున్నారు. అవసరమైన పనులు చాలా వరకు వాయిదా పడుతున్నాయి. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– బడుగు బాలాజీ,ఉండి

గతంలో పని ఒత్తిడి లేదు

గత ప్రభుత్వంలో పలురకాల సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నా ఎప్పుడూ పని ఒత్తిడి మాకు తెలియలేదు. దానికి కారణం గ్రామ, వార్డు వలంటీర్లే. సర్వే గానీ సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపు గానీ వెంటనే జరిగిపోయేవి. ఇప్పుడు ఏం చేయాలన్నా సచివాలయ అధికారులపైనా భారం పడుతుంది. ఒకటి తరువాత మరొక పని చేయలేక అధికారులు, సచివాలయ ఉద్యోగస్తులు ఇబ్బంది పడుతున్నారు.

–ఓ మహిళా అధికారి

భవిత కేంద్రంలో గ్రహణమొర్రి ఉచిత నిర్ధారణ పరీక్షలు

భీమవరం: పట్టణంలోని గాలి రామయ్య మునిసిపల్ స్కూల్ భవిత సెంటర్‌లో మంగళవారం బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి–రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత గ్రహణ మొర్రి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి శ్యాంసుందర్ మాట్లాడుతూ గ్రహణ మొర్రి నిర్ధారణ పరీక్షలకు 14 మంది హాజరుకాగా వారిలో 11 మందికి ఆపరేషన్స్ అవసరమవుతాయని గుర్తించినట్లు చెప్పారు. వారందరికీ ఈనెల 17వ తేది నుంచి హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. శస్త్రచికిత్సలనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్పీచ్ థెరపీ గురించి తెలియజేశారు. డాక్టర్ రాజేష్, డాక్టర్ జోషి పరీక్షలు నిర్వహించగా ఐయి కోఆర్డినేటర్ సీహెచ్ఎస్ వి సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె బేబీకుమారి, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేటర్ టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందామని భీమవరం హెడ్ పోస్ట్ ఆఫీసర్ ఎ.రాజు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు అన్నారు. భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం పోస్టల్ శాఖ కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించి ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో పూర్తిగా అవగాహన కల్పిస్తున్నామని, గుడ్డ సంచులనే వినియోగించాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజంపై ఉద్యమించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం జరిగిందని, వాడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోస్టల్ సత్యనారాయణ, లెనిన్ బాబు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

వీరవాసరం: మండలంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన వీరవాసరంలో జెండా ఆవిష్కరణ నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవ్వాకుల సత్యనారాయణమూర్తి మంగళవారం తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఉదయం 9 గంటలకు జరిగే జెండా ఆవిష్కరణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కేంద్రమైన భీమవరంలో నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలకు నిరసనగా యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): పేదలందరికీ ఇళ్లు ఏర్పాటు దిశగా ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. దీనిలో భాగంగా అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పీఎంఏవై గ్రామీణ్, అర్బన్‌లో ఇళ్లు మంజూరై, వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు యూనిట్ విలువకు అధనంగా ఆర్థిక సహాయం అందజేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఇళ్ల నిర్మాణానికి సమన్వయంతో కృషి చేయాలన్నారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

కాళ్ల: నిబంధనలకు అనుగుణం మద్యం అమ్మకాలు సాగించాలని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాళ్లలో మద్యం దుకాణాలను మంగళవారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా షాపులలో రిజిస్టర్లు పరిశీలించి యాజమానులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా కాళ్ల గ్రామంలోని మూడు మద్యం షాపులు పరిశీలించామన్నారు. దుకాణాల్లో ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. ప్రభుత్వం సూచించిన ఎంఆర్‌పీ ధరలకే అమ్మకాలు చేయాలని స్పష్టం చేశారు.

'యువత పోరు'ను విజయవంతం చేయాలి



ఆకివీడు: యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు



ఉండి: యువతపోరు పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న మండల వైఎస్సార్ సీపీ నాయకులు



పాలకోడేరు: యువత పోరు వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆకివీడు: జనమే జగన్ ఎజెండా అని, ఉద్యోగ ఉపాధి కల్పనలో మేటిగా ఆయన పరిపాలన నిలిచిందని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య చెప్పారు. యువత పోరు వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలుపుదలకు వ్యతిరేకంగా యువత పోరును భీమవరం కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మంతెన సునిల్ కుమార్ వర్మ, ఇందుకూరి నారాయణరాజు, భూపతిరాజు బుజ్జిరాజు, చిగురుపాటి జయశీలుడు(చిట్టిబాబు), అద్దంకి ప్రసాద్, కమతం మహేష్, కమ్మిల బాబి, మందపాడు శ్రీను, ఈదా జాషువ తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసమే వైఎస్సార్ సీపీ ప్రారంభించారని పార్టీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు అన్నారు.మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయం పెదఅమిరంలో మండలస్థాయిలో కార్యకర్తలు, నాయకులకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో బుధవారం నిర్వహించనున్న యువత పోరు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఉదయం 9 గంటలకు పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు జరుగుతాయని, అనంతరం యువత పోరు కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటామన్నారు. కార్యక్రమంలో గులిపల్లి అచ్చారావు, కరిమెరక శివనాగరాజు, జి.సుందర్‌కుమార్, సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి, గుండాబత్తుల సుబ్బారావు, శేషాద్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పాలకోడేరులో..

పాలకోడేరు: విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ చంద్రబాబు సర్కారుపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు చేకూరి నరేంద్ర రాజు కోరారు. ఈ సందర్భంగా పాలకోడేరు యువత పోరు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీమ్ కింద ఇవ్వాల్సిన రూ.4,600 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ పాలా రాధాకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి తమ్మిశెట్టి అబ్బులు, నాయకులు గుండు నాగేశ్వరరావు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, సాల్మన్ రాజు, చింతలపాటి బలరామరాజు,గుంటపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

యువత పోరు విజయవంతం చేయండి

భీమవరం అర్బన్: విద్యార్థుల కోసం చేపడుతున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జిల్లా కొండయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గత వైఎస్ర్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఏడాది ఫీజు రీయంబర్స్‌మెంట్, విద్యా దీవెన నిధులను సకాలంలో విడుదల చేయడంతో విద్యార్థులు ఏ ఇబ్బంది లేకుండా విద్యనభ్యసించేవారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా విద్యార్థుల కోసం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. ఈ సందర్భంగా పెదఅమిరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేసి ర్యాలీగా జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తారని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి



భీమవరంలో పేదల నుంచి ఇళ్లస్థలాల కోసం దరఖాస్తులు పూర్తి చేయిస్తున్న దృశ్యం

భీమవరం: ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు పేదలకు ఇస్తామన్న ఇళ్లస్థలాలను తక్షణం పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సీపీఐ, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పట్టణంలోని లంకపేట, దుర్గాపురం తదితర ప్రాంతాల్లో ఇళ్లులేని నిరుపేదల చేత ఇళ్ల స్థలాలకోసం వ్యక్తిగత అర్జీలను పూర్తి చేయించారు. అనంతరం భీమారావు మాట్లాడుతూ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నందున ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదలు స్వంత గృహాలు లేక అద్దె ఇళ్లకు వేలాది రూపాయలు అద్దెలు చెల్లించలేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలని కోనాల డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం సీతారాంప్రసాద్, ఏపీ మహిళా సమాఖ్య కార్యదర్శి సికిలే పుష్పకుమారి పాల్గొన్నారు.

విజయవాడకు తరలివెళ్లిన మునిసిపల్ కార్మికులు



భీమవరం నుంచి విజయవాడ బస్‌లో బయలుదేరిన మునిసిపల్ కార్మికులు

భీమవరం: మున్సిపల్ వర్కర్స్ సమస్యలను తక్షణం పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఏఐటియూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం యూనియన్ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి మంగళవారం భీమవరం నుంచి బస్‌లో మున్సిపల్ కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించిన చెల్లబోయిన, మల్లేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూ నాయకులు కె మహంకాళి, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

దళితులకు ప్రత్యేక శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

భీమవరం: పట్టణంలోని 39వ వార్డులో దళితులు, దళిత క్రైస్తవులకు ప్రత్యేకంగా శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని మంగళవారం దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ పట్టణంలో వేలాదిగా నివసిస్తున్న దళితులు, దళిత క్రైస్తవులకు శ్మశాన వాటిక లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎవరైనా చనిపోతే ఖననం చేయడానికి స్థలం లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. దీనికి స్పందించిన తహసీల్దార్ రాంబాబు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పరువు విజయకుమార్, ఎ ఆనందకుమార్, టి జాన్‌కెనడి తదితరులు పాల్గొన్నారు.

అన్నింటా మహిళలే మహారాణులు



ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా ప్రతినిధులను సత్కరిస్తున్న దృశ్యం

ఆకివీడు: అన్ని రంగాల్లో మహిళలు మహారాణులుగా వెలుగొందుతున్నారని ఎంపీపీ కశారి జయలక్ష్మి చెప్పారు. మహిళా దినోత్సవం నేపథ్యంలో మంగళవారం మండలంలోని మహిళా ప్రతినిధులను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ మహిళలకు ధైర్యసాహసాలే ఆయుధాలన్నారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు మాజీ సీఎం జగన్ కల్పించడం అభినందనీయమన్నారు. ఎంపీడీఓ సుహాసిని మాట్లాడుతూ కృషి పట్టుదలతో దేనినైనా సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో మండలంలోని మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ మహిళా సిబ్బందిని సత్కరించారు.